సాక్షి ఖమ్మం

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



కేసీఆర్‌కు లబ్ధిదారులే అండ

సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న వారు సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య కోరారు. 8లో



పెద్దాస్పత్రిలో చికెన్‌తో భోజనం!

జిల్లా పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఇక నుంచి వారానికోమారు చికెన్‌తో భోజనం వడ్డించనున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
34° / 21°

వాతావరణం

శనివారం జిల్లాలో మధ్యాహ్న ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. ఉదయం, సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పీటీసీల్లో ఏర్పాట్లు చేయండి



వీసీకి హాజరైన సీపీ వారియర్, అధికారులు

ఖమ్మంక్రైం: స్టైఫండరీ కేడెట్ కానిస్టేబుళ్ల శిక్షణ కోసం పోలీస్ శిక్షణ కేంద్రాల్లో ఏర్పాట్లుచేయాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఐజీ తరుణ్ జోషి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీస్ శిక్షణ కోసం శిక్షణ కేంద్రాల్లో కావాల్సిన సదుపాయాలు, ఇండోర్, ఔట్ డోర్‌లో ఏర్పాట్లు, జనరేటర్లు, కంప్యూటర్ ల్యాబ్‌లు సిద్ధం చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఖమ్మం సీపీ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ జిల్లాలోని సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో ఉన్న సౌకర్యాలు, చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కుమారస్వామి, సీపీటీసీ వైస్ ప్రిన్సిపాల్ వెంకటస్వామి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి రుణాలు

ఖమ్మంగాంధీచౌక్: దివ్యాంగుల ఉపాధి, పునరావాసం కోసం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీడబ్ల్యూఓ సీహెచ్.సంధ్యారాణి తెలిపారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, వ్యాపార నిర్వహణకు గాను జిల్లాకు వంద యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఇందులో రూ.50వేలు మొదలు రూ.3లక్షల విలువైన యూనిట్లు ఉన్నాయని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న దివ్యాంగులు వివరాల కోసం tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో చూడడంతో పాటు ఆన్‌లైన్‌లోనే ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు

ఖమ్మంమయూరిసెంటర్: గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని(బాలురు), కాచనపల్లి(బాలికలు)తో పాటు హైదరాబాద్ బోయినపల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీల్లో ఐదో తరగతి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఈమేరకు ఈనెల 25 నుండి 28వ తేదీ వరకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కృష్ణనాయక్ తెలిపారు. జిల్లాలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో పోటీలు ఉంటాయని, ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతూ ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఉసరికాయలపల్లి పాఠశాలలో జరిగే పోటీలకు హాజరు కావాలని సూచించారు.

21న టీటీడీసీలో జాబ్ మేళా

ఖమ్మంమయూరిసెంటర్: ఈజీఎంఎం–డీఆర్‌డీఏ ఆధ్వర్యాన ఈనెల 21న ఖమ్మంలోని టీటీడీసీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఆర్డీఓ ఎం.విద్యాచందన తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రాష్ట్రంలోని పలు శాఖల్లో ఖాళీగా ఉన్న 200 పోస్టులను భర్తీకి ఈ జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ ఉండి 19 నుండి 28 ఏళ్ల లోపు వయస్సు అభ్యర్థులు హాజరుకావొచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 21న ఉదయం 10.30 గంటలకు టీటీడీసీ సమావేశ మందిరానికి రావాలని, వివరాల కోసం 89776 31851 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన జెడ్పీ సీఈఓ



పాలేరు నర్సరీలో పరిశీలిస్తున్న సీఈఓ

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా పరిషత్ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వీ.వీ. అప్పారావు శుక్రవారం పరిశీలించారు. తొలుత కూసుమంచిలోని శివాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన, పాలేరులోని నర్సరీ, పబ్లిక్ టాయ్‌లెట్లను తనిఖీ చేశారు. ఆతర్వాత జుజుల్‌రావుపేటలోని ప్రభుత్వ భూమిలో నర్సరీ ఏర్పాటుపై సూచనలు చేశారు. డీఎల్పీఓ పుల్లారావు, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ రాంచందర్‌రావు, గ్రామ కార్యదర్శులు నరేష్, సహజ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు అవార్డు!



కొత్తగూడెం పాఠశాలలో పండించిన కూరగాయలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కొత్తగూడెం పాఠశాలలోని వాటర్‌ప్లాంట్

- జిల్లాలో స్వచ్ఛ విద్యాలయాలుగా 37బడులు
- గ్రామీణ ప్రాంతాల్లో 23, పట్టణ ప్రాంతాల్లో 14 ఎంపిక
- జాబితా ప్రకటించిన కేంద్ర విద్యాశాఖ

ఖమ్మం సహకారనగర్: పాఠాలు చెప్పడమే కాక పాఠశాలల పరిసరాలు, ఆవరణను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం మెరుగవుతుందని.. విద్యపై శ్రద్ధ చూపే అవకాశం దక్కుతుందని భావించిన కేంద్రప్రభుత్వం స్వచ్ఛ విద్యాలయాల ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. ఇందులో భాగంగా తాజాగా విడుదల చేసిన జాబితాలో జిల్లా నుంచి 37 పాఠశాలలకు స్థానం దక్కింది. పాఠశాలల్లో ఆహ్లాదం, ఆరోగ్యకరమైన పరిసరాలు, మంచి వాతావరణాన్ని నెలకొల్పే క్రమంలో జిల్లాలోని 1,710 విద్యాసంస్థల్లో స్వచ్ఛ విద్యాలయాల కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో నుంచి 2022 సంవత్సరానికి 1,512 పాఠశాలు రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రత్యేక బృందాల పరిశీలన అనంతరం పురస్కారాలు ప్రకటించారు.

సబ్ కేటగిరీ విభాగంలో ఎంపికైన పాఠశాలలు

మెయిన్ కేటగిరీలో అవార్డుకు జిల్లాలోని ఏడు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇక సబ్ కేటగిరీ విభాగంలో ఎంపికైన పాఠశాలల వివరాలిలా ఉన్నాయి. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన ఎంపీయూపీఎస్, వైరా మండలంలో గొల్లపుడి(ఎంపీపీఎస్), పుణ్యపురం(ఎంపీయూపీఎస్), తల్లాడ మండలంలో నిమ్మగూడెం(ఎంపీపీఎస్), అన్నారుగూడెం, సింగరేణి మండలం కారేపల్లి టీఎస్‌ఎంఎస్, సత్తుపల్లి మండలం అయ్యగారిపేట హైస్కూల్, రఘునాథపాలెం మండలం చింతగుర్తి ఎంపీయూపీఎస్, పెనుబల్లి మండలం మర్లగుంట(ఎంపీయూపీఎస్), ఎంవీ.బంజర(ఎంపీయూపీఎస్), ముదిగొండ మండలం మేడేపల్లి జెడ్పీహెచ్‌ఎస్, మధిరలోని టీవీఎం హైస్కూల్, కూసుమంచి జెడ్పీహెచ్‌ఎస్, కొణిజర్ల మండలం పల్లిపాడు, పెద్దమునగాల ఎంపీపీఎస్‌లు, ఖమ్మం అర్బన్ మండలం గోపాలపురం, టేకులపల్లి ఎంపీపీఎస్‌లు, గాంధీనగర్, నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలు, హార్వెస్ట్ స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, రాయల్ కిడ్స్ స్కూళ్లు ఎంపికైన జాబితాలో ఉన్నాయి. ఇంకా ఖమ్మం రూరల్ మండలంలోని కేజీబీవీ, కల్లూరు మండలం నారాయణపురం ఎంపీపీఎస్, ఏన్కూరు టీఎస్‌ఆర్‌ఈఐఎస్, చింతకాని మండలం అనంతసాగర్ ఎంపీపీఎస్ జాబితాలో స్థానం దక్కించుకున్నాయి.

37 పాఠశాలలకు స్థానం

కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని విద్యాశాఖ స్వచ్ఛ పాఠశాలల జాబితా ప్రకటించింది. ఈమేరకు జిల్లా నుంచి 37 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని 23, పట్టణ ప్రాంతాల్లోని 14 పాఠశాలలు ఉన్నాయి. ఇక రాష్ట్రస్థాయికి జిల్లా నుంచి 8 పాఠశాలలు ఎంపిక కాగా ఇందులో కొత్తగూడెం పాఠశాలకు ప్రత్యేక ప్రశంసలు దక్కాయి. రాష్ట్రప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగుపర్చేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే కేంద్రం ప్రకటించిన అవార్డులకు పాఠశాలలు ఎంపికయ్యాయని చెబుతున్నారు.

మెయిన్ కేటగిరీలో అవార్డు పొందిన పాఠశాలలు

మండలం	పాఠశాల
వైరా	ఎంపీపీఎస్, రెబ్బవరం
తల్లాడ	ఎంపీపీఎస్, మల్లారం
సత్తుపల్లి	ఎంపీహెచ్‌ఎస్, అన్నారుగూడెం
సత్తుపల్లి	టీఎంఆర్‌ఈఐఎస్ (బాలుర)
నేలకొండపల్లి	ఎంపీపీఎస్, సింగరెడ్డిపాలెం
ఖమ్మం అర్బన్	ఎంపీపీఎస్, కొత్తగూడెం
కల్లూరు	జెడ్పీహెచ్‌ఎస్, చిన్నకొరుకోండి

కొత్తగూడెం పాఠశాలకు ప్రత్యేక ప్రశంస



ఖమ్మం అర్బన్ మండలంలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలకు ప్రత్యేక ప్రశంసలు దక్కాయి. స్వచ్ఛ విద్యాలయాలుగా మొత్తం 37 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇక రాష్ట్రస్థాయికి ఎంపికైన వాటిలో ఎనిమిది పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కొత్తగూడెం పాఠశాలకు ప్రత్యేక ప్రశంసలు లభించాయి.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

శివోహం



కూసుమంచిలోని శివాలయంలో పుష్పాలంకరణ

మహాశివరాత్రి పర్వదినానికి జిల్లాలోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. రంగురంగుల లైట్లు, పుష్పాలతో ఆలయాలను అలంకరించగా.. శనివారం తెల్లవారుజామున పూజలు మొదలుకానున్నాయి. - 9లో...

మార్కెట్ లక్ష్యాలను సాధిస్తాం




కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న చైర్‌పర్సన్ శ్వేత

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తామని చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత తెలిపారు. నూతన పాలకవర్గ తొలి సమావేశాన్ని శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. తొలుత సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయడంతో పాటు మార్కెట్ కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మార్కెట్ కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం అజెండాను ప్రవేశపెట్టగా, మూడు నెలల ఆదాయ వ్యయాలపై చర్చించి, వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలపై చర్చించారు. ఈసందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కేటాయించిన నిధులతో మార్కెట్ యార్డుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, బస్తీ దవాఖానా ఏర్పాటు కృషి చేస్తున్నామని తెలిపారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.నాగరాజు, గ్రేడ్–2 కార్యదర్శి బి.బజార్, సహాయ కార్యదర్శులు డి.నిర్మల, ఎస్.రాజేంద్రప్రసాద్‌తో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ దందాకు పరాకాష్ట

- 2011లో తెలంగాణ పేరిట సర్టిఫికెట్
- భూకబ్జా కోసం నకిలీ డెత్ సర్టిఫికెట్ తయారీ



2011లోనే తెలంగాణ ప్రభుత్వం పేరుతో తీసుకొచ్చిన డెత్ సర్టిఫికెట్

ఖమ్మంమయూరిసెంటర్: గతంలో ఖానాపురం పంచాయతీ.. ప్రస్తుతం కేఎంసీ నాలుగో డివిజన్‌లోని వేణుగోపాలనగర్–2! ఇక్కడ నివాసముండే వ్యక్తి 2011లో మరణించగా.. ఆయన కుమారులు 2020లో తమ ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం తండ్రి డెత్ సర్టిఫికెట్ తీసుకున్నారు. ఖానాపురంలో నివాసముండే వ్యక్తి పోలెపల్లి పంచాయతీ పరిధిలో మృతి చెందగా, 2011లోనే తీసుకున్నట్లుగా సర్టిఫికెట్ సాధించారు. ఇంత వరకు బాగానే ఉన్న సర్టిఫికెట్‌పై తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అని ముద్రించి ఉండడం అక్రమ బాగోతాన్ని బయటపెట్టింది. తెలంగాణ ఏర్పడింది 2014లో అయితే 2011లో ఇచ్చినట్లుగా సర్టిఫికెట్‌పై తెలంగాణ ముద్ర ఉండడం.. ఇది ఎలా వచ్చింది, ఎవరు ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

భూముల విలువ పెరగడంతో...

ఖమ్మం నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో భూములకు ధరలు భారీగా పెరిగాయి. దీంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేందుకు కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేసిన యజమానులకు చుక్కలు కనిపించేలా దందాకు పాల్పడుతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే హద్దులు తెలుసుకుని మరీ నకిలీ డాక్యుమెంట్లను సృష్టిస్తున్నారు. ఒకరి పేరు నుంచి మరొకరికి పేరుపైకి బదలాయించేందుకు తప్పుడు ధ్రువపత్రాలను పుట్టిస్తుండగా.. ఖమ్మంలో రోజుకో భూపంచాయితీ తెరపైకి వస్తోంది.

నకిలీ ధ్రువపత్రాలతోనే రిజిస్ట్రేషన్లు

డాక్యుమెంట్లు, ధృవపత్రాల జారీ, పరిశీలనలో పక్కాగా వ్యవహరించాల్సిన పంచాయతీ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు అలా చేయడంలేదు. దీంతో ఆక్రమణదారులు తమకు అనువుగా నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి మరీ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఇక నోటరీల వద్ద కూడా తప్పుడు తేదీలతో తయారు చేయించి పనులు చక్కబెట్టుకుంటున్నారు. పంచాయతీ, వార్డు, డివిజన్ల స్థాయిలో కీలకంగా ఉండాల్సిన కార్యదర్శులు, సిబ్బంది సైతం ఆక్రమణదారులకు కొమ్ముకాస్తూ నకిలీ ధ్రువపత్రాలను జారీ చేస్తుండడంతో భూముల యజమానులకు నష్టం జరుగుతోంది. జిల్లాలో ఇప్పటికే ఇలాంటివి వెలుగుచూడగా, మరిన్ని అక్రమాలు జరగకముందే అధికార యంత్రాంగం మేల్కొనాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సెస్సీ పరీక్షలకు 16,861 మంది

డీఈఓ సోమశేఖరశర్మ



విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తున్న డీఈఓ శర్మ

వైరా: ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలకు జిల్లా నుంచి 16,861 విద్యార్థులు హాజరుకానున్నారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. వైరాలోని జెడ్పీహెచ్‌ఎస్, జీహెచ్‌ఎస్ పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10,698 మంది, ప్రైవేట్‌విద్యార్థులు 6,163 మంది పరీక్షలకు హాజరు కానుండగా, 104 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం విద్యార్థుల అల్పాహారం కోసం రూ.36 లక్షలు విడుదల చేసిందని చెప్పారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

వైరారూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. మండలంలోని రెబ్బవరం, పాలడుగు, గన్నవరం, గరికపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లను తనిఖీ చేసిన ఆయన విద్యార్థులతో మాట్లాడడంతో పాటు బోధనపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. తనిఖీల్లో ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు రంగారెడ్డి, శాంతకుమారి, చావా శ్రీనివాసరావు, కూరకుల సైదయ్య, శివన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షర్మిల పాదయాత్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ నంద్యాల రవీందర్‌రెడ్డి కోరారు. పాలేరులో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20వ తేదీన తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండా వద్ద యాత్ర మొదలవుతుందని తెలిపారు. నాయకులు వైవీడీ. రెడ్డి, బానోత్ ఉపేందర్, నగేష్, సుధాకర్, కిషోర్, గంగారెడ్డి, రమేష్, ఉపేందర్, ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

కొత్త ఈఓకు కత్తిమీద సామే..

- భద్రాద్రి ఆలయ ఉద్యోగుల్లో వర్గ విభేదాలు.. అధికారుల్లో నిర్లక్ష్యం
- లడ్డూకు బూజు పట్టడంతో రాష్ట్రస్థాయిలో అభాసుపాలు
- భద్రాచలం రామాలయాన్ని చుట్టుముట్టిన వివాదాలు
- మరోవైపు సమీపిస్తున్న నవమి, పట్టాభిషేక మహోత్సవాలు
- ఈఓ రమాదేవిపై సమస్యలను చక్కదిద్దాల్సిన బాధ్యతలు



రామాలయం వ్యూ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం నూతన ఈఓగా బాధ్యతలు స్వీకరించిన రమాదేవికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన రామాలయం పేరు ఇటీవల వరుస వివాదాలతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చల్లో నిలిచింది. ఆలయ ఉద్యోగుల నడుమ కొరవడిన సమన్వయం, గోశాల నిర్మాణం పూర్తి, ఏపీలోని రామయ్య భూముల రక్షణ తదితర సమస్యలను చక్కదిద్దడంతోపాటు వచ్చే నెలలో జరిగే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవం విజయవంతం చేయాల్సిన బాధ్యత కొత్త ఈఓపై ఉంది.

కొరవడిన సమన్వయం

ఉద్యోగులు, సిబ్బంది నడుమ సమన్వయం కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. పూజల్లో, క్రతువుల్లో కీలక పాత్ర పోషించే వైదిక సిబ్బంది నడుమ వర్గపోరు ఇటీవల తారాస్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఉన్న వైదిక కమిటీలో రెండో ప్రధాన అర్చకుడికి స్థానం కల్పించకపోతే ఉత్సవాల బహిష్కరణకు సైతం సిద్ధమంటూ ఉన్నతాధికారులకు అల్టిమేటం జారీ చేశారు. ఒక వర్గం ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైదిక క్రతువు సమాచారాలను సైతం తెలపటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరందరినీ సమన్వయ పరిచి, పాలన గాడిలో పెట్టాల్సి ఉంది.

రామయ్య భూముల రక్షణ..

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 1,350 ఎకరాల భూమి ఉన్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో అత్యధికంగా 889 ఎకరాలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పురుషోత్తపట్నం గ్రామంలోనే ఉంది. వీటిలో అత్యధిక భాగం ఆక్రమణలోనే కొనసాగుతోంది. వివాదం ముదిరి ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులకు నోటీసులను జారీ చేస్తున్నప్పటికీ రామయ్య భూముల్లో ఆక్రమణలు ఆగలేదు. హైదరాబాద్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన రమాదేవికి భూముల రక్షణపై విశేష అనుభవం ఉంది. దీంతో ఆ భూముల వివాదాలను చక్కదిద్ది, భూముల రక్షణ ప్రయత్నాలలోనే దేవాదాయ శాఖ ప్రత్యేకంగా రమాదేవిని ఇక్కడ నియమించారనే ప్రచారం కూడా సాగింది. ఈ క్రమంలో భూముల రక్షణలో ఏ మేరకు సఫలీకృతమవుతారో చూడాల్సి ఉంది. గోశాల నిర్మాణం, రామాలయంలో అభివృద్ధి పనులు, దాతల సహకారం కోసం కూడా చొరవ చూపాల్సి ఉంది.

వచ్చే నెలలో ఉత్సవాలు..

ఇక భద్రాచలంలో మార్చి నెల 30,31వ తేదీల్లో శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించాల్సి ఉంది. మార్చి 22 నుంచి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సుమారు నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఈ నెలలోనే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంది. ఉత్సవాల ప్రచారంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ప్రధాన ఆరోపణలు నెలకొన్నాయి. రామయ్య పెండ్లి పత్రికల వద్ద నుంచి వాటిని గవర్నర్, సీఎం, మంత్రులకు అందించి ఆహ్వానాలు పలకాలి. పుష్కర పట్టాభిషేక మహోత్సవానికి ప్రత్యేక అతిథులను ఆహ్వానిస్తే తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

పర్యవేక్షణా, సమన్వయ లోపం

భద్రాచల దివ్యక్షేత్రంలో అధికారుల పర్యవేక్షణా లోపం తొలి నుంచి సమస్యగా మారింది. ఈఓలు మారుతున్నా ఉద్యోగులను, వైదిక సిబ్బందిని ఏకతాటిపైకి తెచ్చి సమస్యలు పరిష్కరించటంలో, పర్యవేక్షించటంలో విఫలమవుతున్నారు. పర్యవేక్షణా లోపంతో అనేక వివాదాలు రామయ్యను చుట్టుముడుతున్నాయి. ఇటీవల ముక్కోటి ఉత్సవాల సందర్భంగా స్వామివారి ప్రసాదమైన లడ్డూలు బూజు పట్టడం ఉద్యోగులు, ఈఓ స్థాయి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. స్వయంగా భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జోక్యం చేసుకుని స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే ఈఓగా పనిచేస్తున్న శివాజీపై బదిలీ వేటు పడిందనే ప్రచారం సైతం జరిగింది.

వీటన్నింటిని సమన్వయం చేసుకుంటూనే సామాన్య భక్తులకు ఎటువంటి వసతి ఇబ్బందులు తలెత్తకుండా నూతన ఈఓ ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది.

సమస్యల పరిష్కారానికి కృషి..



దేవస్థానంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. అందరి సహాయ సహకారాలతో రామాలయ అభివృద్ధికి ప్రయత్నిస్తాను. వచ్చే నెలలో శ్రీరామనవమి, పట్టాభిషేక ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతోపాటు సామాన్య భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం.

– ఎల్.రమాదేవి, ఈఓ, రామాలయం

క్లుప్తంగా

దార్శనికుడు సీఎం కేసీఆర్

● మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడమే కాక తొమ్మిదేళ్ల పాలనతో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన సీఎం కేసీఆర్ దార్శనికుడని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రజల తరపున మంత్రి పువ్వాడ ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ తరహా అభివృద్ధి, మార్పు కోసం కేసీఆర్‌ను యావత్ దేశం ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు.

మార్కెట్‌లోకి యాక్టివా నూతన మోడల్


యాక్టివా వాహనాన్ని విడుదల చేస్తున్న చైర్మన్, తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మార్కెట్‌లోకి హోండా యాక్టివా నూతన మోడల్ విడుదలైంది. ఈమేరకు భారత్ గ్రూప్ చైర్మన్ కేశా సుభాష్‌చంద్రబోస్ శుక్రవారం వాహనాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్కా హోండా షోరూం జీఎం ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్ కీతో కూడిన నూతన మోడల్‌ను అందుబాటులోకి తీసుకురాగా, అనేక ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో షోరూం జీఎం కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి కేసులో బెయిల్ నిరాకరణ

ఖమ్మంలీగల్: న్యాయవాద దంపతులపై దాడి చేసిన నిందితులకు బెయిల్ నిరాకరిస్తూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తీర్పు చెప్పారు. ఖమ్మంకు చెందిన న్యాయవాద దంపతులు మోజెస్ క్రిస్టోఫర్, అనురాధపై డిసెంబర్ 24న కర్నాటి భానుప్రసాద్, ఆయన అనుచరులు కులం పేరుతో దూషిస్తూ దాడి చేశాగా, నిందితులను ఖమ్మం టూ టౌన్ పోలీసులు ఈనెల 8న అరెస్ట్ చేశారు. వీరి తరఫున దాఖలైన బెయిల్ పిటీషన్ శుక్రవారం విచారణకు రాగా, ఇంకా కొందరిని అరెస్టు చేయాల్సి ఉన్నందున బెయిల్ ఇవ్వొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యర్థించారు. దీంతో ఏకీభవించిన న్యాయమూర్తి బెయిల్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు.

రెండు ఎకరాల భూమి వెనక్కి...

సత్తుపల్లి: భూఆక్రమణతో తమకేం సంబంధం లేదని ఇప్పటివరకు చెబుతుండగా.. రెవెన్యూ అధికారి మెడకు చుట్టుకునే అవకాశం ఉండడంతో భూమిని తిరిగి రైతు పేరిట రిజిస్ట్రేషన్ చేసి తప్పు సరిదిద్దుకునే యత్నం చేశారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 133/64/4లో తన పేరిట ఉన్న రెండెకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేసన్ చేసుకున్నారని ముత్తా వెంకటేశ్వరరావు బుధవారం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ పాత్రపై అనుమానలు వస్తుండగా, సమయమంతుల హరికృష్ణ శుక్రవారం ముత్తా వెంకటేశ్వరరావు పేరిట తిరిగి భూమిని రిజిస్ట్రేషన్ చేశారు.

కేసీఆర్‌కు లబ్ధిదారులే అండ..


లబ్ధిదారులకు ఇంటి పట్టాతో పాటు వస్త్రాలు, పాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

● సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య
● 96 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో గృహప్రవేశం

సత్తుపల్లి: రాజకీయ నాయకుల ప్రమేయం, జోక్యం లేకుండా.. పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను లాటరీ ద్వారా కేటాయించామని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారు సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. సత్తుపల్లి వేశ్యకాంత చెరువు సమీపాన రూ.5.3 కోట్లతో నిర్మించిన 96 డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో శుక్రవారం సామూహిక గృహప్రవేశాలు చేశారు. ఈమేరకు లబ్ధిదారులకు వంట సామాగ్రి, నూతన వస్త్రాలు, దుప్పట్లను ఎమ్మెల్యే సొంత ఖర్చులతో అందజేశాక మాట్లాడుతూ పేదలపై రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చిన చరిత్ర తెలంగాణలో తప్ప దేశంలో మరెక్కడా లేదని చెప్పారు. రాజకీయ స్వార్థం కోసం విమర్శలు చేస్తున్న వారు కంటి వెలుగులో పరీక్ష చేయించుకోవాలని హితవు పలికారు. అనంతరం సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సండ్ర కేక్ కట్ చేశారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు కూసంపూడి మహేష్, తోట సుజలరాణి, కమిషనర్ కె.సుజాత, ఆర్డీఓ కె.సూర్యనారాయణ, ఎంపీపీ దొడ్డా హైమావతి, ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావుతో పాటు ఎస్.కే.రఫీ, గోగులమూడి బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

'పొంగులేటి'పై విమర్శలు గర్హనీయం


మాట్లాడుతున్న బ్రహ్మయ్య, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం గర్హనీయమని.. పొంగులేటి వేసిన ప్రశ్నల్లో తప్పుంటే బహిరంగ చర్చకు రావాలని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య సూచించారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో నాడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శ్రీనివాసరెడ్డి రాజకీయాల్లోకి రాగా.. జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై దృష్టి సారించారన్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో సీఎం కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్‌లో చేరితే 2019 ఎన్నికల్లో ఎంపీ సీటు ఇవ్వకపోగా ఎన్నో అవమానాలకు గురి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పొంగులేటి ప్రశ్నించారని చెప్పారు. ఈవిషయంలో తాము చర్చకు సిద్ధమని, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కూడా వస్తారా అని ప్రశ్నించారు. కాగా, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అధ్యక్ష పదవులు తాత మధుకు ఎలా వచ్చాయో అందరికీ తెలుసునని చెప్పారు. ఇక నుండి శ్రీనివాసరెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదని, 2014, 2018 ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు ఒక్కో సీటు రాగా, 2023 ఎన్నికల్లో ఆ సీటు కూడా రాదని బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజయాబాయి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, కార్పొరేటర్లు జగన్, దొడ్డా నగేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు సురేష్, తిరుమలరావు, జారే ఆదినారాయణ, రాయల పుల్లయ్య, ఉప్పర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం


పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు

కూసుమంచి: మండలంలోని లోక్యాతండాలో గురువారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు ధ్వంసం కాగా, ఒక గొర్రెపోతు మృతి చెందింది. తండాకు చెందిన వడిత్య భీక్యా వంట గదిలోని సిలిండర్ రాత్రి ఒక్కసారిగా పేలడంతో దాని ధాటికి ఇల్లు రేకులు పగిలి, గోడలు బీటలు వారాయి. ఇక వంటగది ముందు భాగం వరండాలో గొర్రెలు కట్టేయడంతో పేలిన సిలిండర్ ముక్కలు తాకి ఒక గొర్రెపోతు చనిపోయింది. అయితే, ఆ సమయాన భీక్యా కుటుంబీకులు పక్కనే ఉన్న దాబా ఇంట్లో నిద్రిస్తుండడంతో ప్రాణాపాయం ఎదురుకాలేదు. కాగా, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

వరిగడ్డి వామి దగ్ధం

వైరారూరల్: విద్యుత్ తీగలు వైర్లు తగిలి వరిగడ్డి వామి దగ్ధమైంది. వైరా మండలం విప్పలమడకకు చెందిన రైతు అక్కిశెట్టి చెంచయ్య ఇంటి ఆవరణలోకి గడ్డి వామికి శుక్రవారం రాత్రి విద్యుత్ లైన్ తాకింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే రూ.30 వేల విలువైన గడ్డి దగ్ధమైందని బాధిత రైతు తెలిపాడు.

భక్తులకు ఏ ఇబ్బందీ రావొద్దు

● ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి


జాతర ఆవరణలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని తీర్థాల జాతరకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా, జాతర సాఫీగా సాగేలా అధికారులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని తీర్థాలలో సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో జాతర విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. తాగునీరు, ఇతర వసతులు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ టి.సుమ, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో చికెన్‌తో భోజనం!

● డైట్ చార్జీలు పెరగడంతో కాంట్రాక్టర్ నిర్ణయం


ఆస్పత్రిలో భోజనం వడ్డిస్తున్న అధికారులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి మరింత పోషకాహారం అందనుంది. ఈమేరకు వారానికో మారు చికెన్‌తో కూడిన భోజనం అందించాలని డైట్ కాంట్రాక్టర్ నర్సింహారావు నిర్ణయించారు. ఈకార్యక్రమానికి సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం శ్రీకారం చుట్టగా... ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆస్పత్రిలోని సుమారు 400 మందికి చికెన్‌తో కూడిన భోజనం వడ్డించారు. గతంలో ఒక భోజనానికి రూ.38 మాత్రమే చెల్లించగా, ఇటీవల రూ.80 చెల్లిస్తున్నారు. దీంతో వారానికోసారి చికెన్‌తో భోజనాన్ని అందించాలని నిర్ణయించినట్లు కాంట్రాక్టర్ తెలపగా, అధికారులు అభినందించారు. ఈకార్యక్రమంలో ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు, డైటీషియన్ మేరీ తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టులందరికీ స్థలాలు ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: సీఎం కేసీఆర్ హామీ మేరకు జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఏకకాలంలో ఇళ్లస్థలాల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 200 గజాల మేర స్థల పట్టాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. అలాగే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల స్థలం సరిపోయే అవకాశం లేనందున మరింత స్థలం సమకూర్చాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు


మహిళలకు సర్టిఫికెట్లు అందచేస్తున్న ఎంపీడీఓ

ఎర్రుపాలెం: మండలంలోని కంద్రికలో నాబార్డు సహకారంతో షేర్ సేవా సంస్థ ఆధ్వర్యాన కుట్టు, అల్లికల్లో 30మంది మహిళలు శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఈమేరకు వీరికి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, నాబార్డు ఏజీఎం ఎల్.సుజిత్, సర్పంచ్ భూక్యా నాగమణి సర్టిఫికెట్లు అందచేశారు. షేర్ సేవా సంస్థ ప్రతినిధి ఎం.హన్మంతరావు, ఎంపీఓ జి శ్రీలక్ష్మి, ఏపీజీవీబీ మేనేజర్ శ్రీనివాసరావుతో పాటు శ్రావణి, యుగేందర్, శ్రీలత పాల్గొన్నారు.

అన్నం ఫౌండేషన్‌లో సోలార్ వెలుగులు


సోలార్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆశ్రమంలో తానా ఫౌండేషన్ బాధ్యులు రూ.7.50లక్షల విలువైన సోలార్ యూనిట్ సమకూర్చారు. విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని తెలుసుకుని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా అధ్యక్షుడు లావు అంజయ్యచౌదరి, ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ, తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా యూనిట్ ఏర్పాటుచేయగా, శుక్రవారం తాళ్లూరి జయశేఖర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు మల్లాది వాసు, దొడ్డపనేని సాంబశివరావు, రంగారావు, రామారావు, బండి నాగేశ్వరావు, అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

చింతకాని: మండలంలోని మత్కేపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో కిరాణం షాపు నడిపే రాయపూడి వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి రెండు రోజుల క్రితం బాసరలోని సరస్వతి ఆలయానికి వెళ్లారు. దీంతో గురువారం అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బీరువాను సైతం తెరిచి 10 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.23 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాసర నుంచి శుక్రవారం ఉదయం చేరుకున్న వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించాక కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం – పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపాన గుర్తుతెలియని వ్యక్తి(40) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అన్నం ఫౌండేషన్ సహకారంతో మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్ తెలిపారు. మృతుడి సమాచారం కోసం 94406 27535 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బస్టాండ్ వద్ద మృతదేహం



ఖమ్మం కొత్త బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని టూటౌన్ పోలీసులు గుర్తించారు. ఈమేరకు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఏన్కూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కేసుపల్లికి చెందిన శెట్టిపల్లి హనుమంతరావు(34) తన సోదరుడి కుమారుడు ఆదిత్యతో కలిసి ద్విచక్రవాహనంపై గురువారం సాయంత్రం ఏన్కూరు వస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈఘటనలో గాయపడిన ఇద్దరిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హనుమంతరావు మృతి చెందాడు. దీంతో ఆయన సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు ధాన్యం వ్యాపారి టోకరా

- రూ.2 కోట్లు ఎగవేత?
- మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో బాధితులు
- పోలీసుస్టేషన్లలో రైతుల ఫిర్యాదు

బెల్లంపల్లి/తాండూర్/రెబ్బెన(ఆసిఫాబాద్): ధాన్యం విక్రయించిన రైతులను ఓ వ్యాపారి నిలువునా ముంచాడు. మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడిచినా డబ్బులు ఇవ్వకుండా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో బాధిత రైతులు శుక్రవారం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. వ్యాపారి నల్ల రమేష్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూర్, కుమురంభీం జిల్లా రెబ్బెన మండలాల్లోని గ్రామాల్లో వంద మందికిపైగా రైతుల వద్ద ఖరీఫ్‌లో సుమారు రూ.2 కోట్లకుపైగా విలువైన వరి ధాన్యం కొనుగోలు చేశాడు. సీజన్ ప్రారంభంలో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధర చెల్లించాడు. దీంతో మిగతా రైతులకు అతడిపై నమ్మకం ఏర్పడటంతో ధాన్యం విక్రయించారు. డబ్బులు కొద్ది రోజుల్లోనే చెల్లిస్తానంటూ గడువు విధిస్తూ వచ్చాడు. అయితే నెలలు గడిచినా డబ్బులు చెల్లించకపోవడం, కొంతకాలంగా రమేష్ మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, అందుబాటులో లేకపోవడంతో రైతుల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఒక్క రెబ్బెన మండలంలోని కిష్టాపూర్‌లో ఆరుగురు, రాజారాంలో నలుగురు, తక్కళ్లపల్లిలో సుమారు 17మంది రైతులు రెండు వేల క్వింటాళ్ల వరకు ధాన్యం విక్రయించారు. ఈ మండలంలో సుమారు రూ.30లక్షల వరకు చెల్లించాల్సి ఉండగా, మంచిర్యాల జిల్లా వెంకటాపూర్‌లో రూ.20 లక్షలు, రేచినిలో రూ.10 లక్షలు, మిగతా గ్రామాల్లో రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు బాధిత రైతుల ద్వారా తెలుస్తోంది. మోసపోయామని గ్రహించిన రైతులు మంచిర్యాల జిల్లా తాండూర్ సీఐ జగదీష్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రెబ్బెన, కన్నెపల్లి పోలీస్‌స్టేషన్లలోనూ ఫిర్యాదు చేశారు.

కల్తీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డీజీపీ అంజనీకుమార్ వెల్లడించారు. 2014 నుంచి 2022 వరకు మొత్తం 991 కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నాసిరకం విత్తనాల విక్రయానికి యత్నించిన 1,932 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 58 మందిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వరి | సాగు ఖర్చు రూ. 1,360... మద్దతు ధర రూ. 2,060

ఖర్చుకు తగినట్లు మద్దతు ధరలు
- కేంద్ర వ్యవసాయ శాఖ తాజా నివేదిక వెల్లడి
- పత్తి ఖర్చు రూ. 4,050... మద్దతు ధర రూ. 6,080
- రైతులకు 50 శాతం ఆదాయం వస్తుందన్న కేంద్రం... 23 రకాల పంటలపై కేంద్ర ప్రభుత్వ విశ్లేషణ
- ఆ ధరలు సరిపోవంటున్న రాష్ట్ర ప్రభుత్వం... రైతులకు మద్దతు ధర పెంచాలని స్పష్టీకరణ
- స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం వరికి మద్దతు ధర రూ. 2,499 ఇవ్వాలని డిమాండ్
- పత్తికి రూ. 8,574, మొక్క జొన్నకి రూ.3,199 ఇవ్వాలంటున్న తెలంగాణ సర్కారు



సాక్షి, హైదరాబాద్: దేశంలో సాగు ఖర్చుకు మించి మద్దతు ధరలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 23 రకాల పంటల సాగుకు అయ్యే ఖర్చు ఎంత? వాటికి అందుతున్న మద్దతు ధర ఎంత అనే దానిపై తాజాగా ఒక అధ్యయన నివేదిక విడుదల చేసింది. వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ) మేరకు సాగు ఖర్చులను దేశ వ్యాప్తంగా లెక్కలోకి తీసుకొని వీటి సరాసరిన నివేదికలో పొందుపరిచింది. 2022–23లో వరి ఉత్పత్తి ఖర్చు క్వింటాల్‌కు రూ. 1,360 ఉండగా, కనీస మద్దతు ధర రూ. 2,060గా కేంద్రం నిర్ధారించిన సంగతి తెలిసిందే. పత్తి ఉత్పత్తి ఖర్చు రూ. 4,053 ఉండగా, దాని మద్దతు ధర రూ. 6,080గా ఉంది. అలాగే మొక్కజొన్న సాగు, ఉత్పత్తి ఖర్చు రూ. 1,308 ఉండగా, దాని మద్దతు ధర రూ. 1,962గా ఉంది. కంది ఉత్పత్తి ఖర్చు రూ. 4,131 కాగా, మద్దతు ధర రూ. 6,600 ఉంది. ఇక సోయాబీన్ ఉత్పత్తి ఖర్చు ధర రూ. 2,805 కాగా, మద్దతు ధర రూ. 4,300 ఉంది. వేరుశనగ సాగు ఖర్చు రూ. 3,873 కాగా, 5,850గా ఉంది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం లాభం కలిగించేలా కనీస మద్దతు ధరలు నిర్ధారించినట్లు కేంద్రం తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఇలా మూడేళ్ల సాగు ఖర్చు, వాటికిచ్చిన మద్దతు ధరల వివరాలను పొందుపరిచింది.

కేంద్రం వర్సెస్ రాష్ట్రం...
అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాగు ఖర్చు వివరాలు, మద్దతు ధరలు శాస్త్రీయంగా లేవని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌కు పలుమార్లు రాష్ట్రంలోని పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం విన్నవించింది. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరలు ఉండాలని కేంద్రాన్ని కోరింది. సాగు ఖర్చుకు మరో 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీ ఇవ్వాలని సీఏసీపీకి ప్రతిపాదించింది. అందులో వివిధ పంటలకు ఎంతెంత ఖర్చు అవుతుందో వివరించింది. పంటల వారీగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటకోత, రవాణా, కూలీ, రైతు కుటుంబ శ్రమకు ప్రతిఫలం అన్నీ కలిపి ఎంత ఖర్చు అవుతుందో సవివరంగా కేంద్రానికి నివేదించింది. ఒక వ్యాపారి తన వస్తువును అమ్ముకునేప్పుడు ధర ఎలా నిర్ణయిస్తారో, ఆ ప్రకారమే పెట్టిన పెట్టుబడి, దానికి అయ్యే వడ్డీలను లెక్కలోకి తీసుకొని సాగు ఖర్చును నిర్ధారించారు. ప్రతీ ఏడాది ఇలాగే శాస్త్రీయంగా సాగు ఖర్చు, ఎంఎస్‌పీ ఎలా ఉండాలో తెలంగాణ వ్యవసాయశాఖ ఇస్తూనే ఉంది. కానీ కేంద్రం తన పద్ధతిలో తాను ఎంఎస్‌పీని నిర్ధారిస్తూ పోతోందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

సాగు ఖర్చు నిర్ధారణలో శాస్త్రీయత లేదు



సాగు ఖర్చును అంచనా వేయడంలో కేంద్రానికి శాస్త్రీయమైన పద్ధతి లేదు. దేశంలో జిల్లాకో రకంగా సాగు ఖర్చు ఉంటుంది. దీంతో ఒకచోట ఎక్కువ ఒకచోట తక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రస్తుతం వేసిన సాగు ఖర్చు, దాని ప్రకారం మద్దతు ధర నిర్ధారణ సరిగా లేదు. దీంతో రాష్ట్రంలో ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఏసీపీకి పంపే నివేదికలకు ఏమాత్రం విలువ ఉండటం లేదు.

– డి.నర్సింహారెడ్డి, జాతీయ వ్యవసాయ నిపుణులు

వరి సాగు ఖర్చు ఎకరానికి రూ. 40 వేలు...

సాధారణ వరి రకం పండించేందుకు నారుమడి సిద్ధం చేయడం మొదలు విత్తనాలు, నాట్లు, ఎరువులు, కలుపుతీత, చివరకు పంట కోత, కూలీల ఖర్చు, కుటుంబ సభ్యుల శ్రమ మొత్తం కలుపుకుంటే ఎకరానికి రూ. 40 వేలు ఖర్చు (24 క్వింటాళ్లు) అవుతున్నట్లు లెక్కగట్టింది. ఆ ప్రకారమే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేసింది. ఎకరా ఖర్చు ప్రకారం క్వింటా వరి పండించాలంటే రూ. 1,666 ఖర్చు అవుతుందని నిర్ధారణ చేసింది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సాగు ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీ రూ. 2,499 ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి ఎంఎస్‌పీ రూ. 2,060గా ఉండగా, అధికంగా పెంచాలని కోరుతున్నారు. అలాగే రాష్ట్రంలో అత్యధికంగా సాగు చేసే పత్తికి కూడా ఎకరాకు రూ.40 వేలు ఖర్చుకానుంది. అయితే ఎకరాకు పత్తి ఏడు క్వింటాళ్లు పండుతాయి. కాబట్టి క్వింటాకు రూ. 5,714 ఖర్చు కానుంది. ఆ లెక్కన స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రూ. 8,574 పెంచాలని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం పత్తి మద్దతు ధర రూ. 6,080 మాత్రమే ఉండగా, మరో రూ. 2,491 వరకు పెంచాల్సి ఉంటుంది. జిల్లా.. జిల్లాకు సాగు ఖర్చులో తేడా ఉంటున్నందున దేశీయంగా ఒకేవిధమైన ఉత్పత్తి ఖర్చు అంచనా వేయలేమని, సరాసరిని లెక్కలోకి తీసుకోవడం తగదని పలువురు అంటున్నారు. మొక్కజొన్నకు ఎకరానికి రూ. 32 వేల వరకు ఖర్చుకానుంది. ఎకరానికి 15 క్వింటాళ్లు పండిస్తారు. అంటే క్వింటాకు రూ. 2,133 ఖర్చు కానుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 3,199 ఇవ్వాలని అంటున్నారు. కందికి రూ. 21 వేల వరకు ఖర్చుకానుంది. ఎకరానికి 4 క్వింటాళ్లు పండుతుంది. అంటే క్వింటాలుకు రూ. 5,250 ఖర్చు వస్తుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 7,875 పెంచాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం దీనికి రూ. 6,600 మద్దతు ధర ఉంది. సోయాబీన్‌కు రూ. 32 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరానికి 5 క్వింటాళ్లు పండుతుంది. దీనికి క్వింటాలుకు రూ.6,400 ఖర్చు కానుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 9,600 చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

ఇంటరాగేషన్‌లో గాయాలు.. వ్యక్తి మృతి!

- మెదక్ పట్టణంలో చైన్ స్నాచింగ్
- అనుమానంతో ఖదీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విడిచిపెట్టాక అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిక.. చికిత్స పొందుతూ మృతి



ఖదీర్ భార్య, పిల్లలు.



చికిత్స పొందుతూ గాంధీలో మృతి చెందిన ఖదీర్

మెదక్ జోన్: చైన్ స్నాచింగ్ చేశాడనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తి.. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు చిత్రహింసలు పెట్టి, ఇష్టం వచ్చినట్టుగా కొట్టారని.. దానితో కిడ్నీలు దెబ్బతిని మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెదక్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య ఎస్పీకి ఫిర్యాదు చేసింది. భర్త చావుకు కారణమైన పోలీసులపై హత్యకేసు పెట్టి, అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది.

అసలు ఏం జరిగింది?
మెదక్ పట్టణంలోని అరబ్ గల్లీలో జనవరి 27న గుర్తు తెలియని దుండగుడు ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు తెంపుకెళ్లాడు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. ఆ దుండగుడు మహ్మద్ ఖదీర్ అని అనుమానించారు. మెదక్ పట్టణంలో చిన్న పాన్ షాపు నడుపుకొనే ఖదీర్.. అది సరిగా నడవకపోవడంతో కొన్నిరోజులుగా హైదరాబాద్‌లోని తన సోదరి ఇంట్లో ఉంటూ కూలిపనులు చేసుకుంటున్నాడు. అతడి గురించి ఆరా తీసిన పోలీసులు జనవరి 29న హైదరాబాద్ వెళ్లి, సోదరి ఇంట్లో ఖదీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మెదక్ ఠాణాకు తరలించి ఐదు రోజులపాటు అదుపులో ఉంచుకున్నారు. ఏమీ తేలకపోవడంతో ఫిబ్రవరి 3న మెదక్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశారు.

దెబ్బలకు కిడ్నీలు దెబ్బతిని..
పోలీసులు వదిలేసిన తర్వాత ఖదీర్ తీవ్రంగా అస్వస్థతకు లోనయ్యాడు. ఫిబ్రవరి 6న మెదక్ ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. పరీక్షలు చేసిన వైద్యులు బలమైన దెబ్బలు తగిలి కిడ్నీలు చెడిపోయాయని, మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. దీనితో ఖదీర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, మూడు రోజులు చికిత్స చేయించారు. ఈ ఖర్చులను పోలీసులే భరించారని ఖదీర్ భార్య తెలిపింది. కానీ ఖదీర్ పరిస్థితి విషమించడంతో ఫిబ్రవరి 12న గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ 16న రాత్రి మృతి చెందాడు. గురువారం రాత్రే ఖదీర్ చనిపోయినా.. కేసు నమోదవకపోవడం, ఎఫ్ఐఆర్ కాకపోవడంతో మృతదేహానికి శుక్రవారం రాత్రి వరకు పోస్టుమార్టం చేయలేదు. దీనితో పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 174 కింద కేసు నమోదు చేశారు.

ఎస్సై, కానిస్టేబుళ్లు బదిలీ
ఖదీర్ మృతి నేపథ్యంలో మెదక్ పట్టణ ఎస్సై రాజశేఖర్‌ను డీసీఆర్బీకి అటాచ్ చేస్తూ.. కానిస్టేబుల్ పవన్ కుమార్‌ను రేగోడుకు, ప్రశాంత్‌ను పాపన్నపేటకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

అకారణంగా నా భర్తను చంపేశారు
దొంగతనం నెపంతో తన భర్తను దారుణంగా కొట్టి చావుకు కారణమైన పోలీసులపై హత్యకేసు నమోదు చేయాలని ఖదీర్ భార్య సిద్దేశ్వరి డిమాండ్ చేశారు. దీనిపై శుక్రవారం మెదక్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన భర్తను అకారణంగా చంపి తనను, తన ముగ్గురు పిల్లలను రోడ్డున పడేసిన పోలీసులకు ఉసురు తగులుతుందంటూ ఆమె రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. కాగా.. హైదరాబాద్‌లోని తమ ఇంట్లో ఖదీర్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో పోలీసులు దారుణంగా కొట్టారని, కాళ్లు మొక్కినా వినలేదని ఖదీర్ సోదరి తపసుల్ పేర్కొన్నారు.

పాత నేరస్తుడని అదుపులోకి..
"ఖదీర్ పాత నేరస్తుడు. అరబ్‌గల్లీలో ఓ మహిళ మెడలోంచి గొలుసు తెంపుకెళ్లిన వ్యక్తి సీసీ ఫుటేజీలో ఖదీర్‌లా ఉండటంతోనే అదుపులోకి తీసుకున్నాం. ప్రశ్నించిన తర్వాత ఫిబ్రవరి 3వ తేదీన తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశాం. 6వ తేదీన అతడు ఆస్పత్రిలో చేరాడు. మధ్య ఏం జరిగిందో మాకు తెలియదు.."
– మెదక్ డీఎస్పీ సైదులు

మార్చి 25లోగా ఉపాధి పనుల పూర్తి

పీఆర్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, జీపీ భవనాల పనులను వచ్చేనెల 25 లోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. మంజూరైన ఉపాధి పనులు, గ్రౌండింగ్ పనుల ప్రగతిపై శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోసమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులు పూర్తిచేసి ఎఫ్‌టీపీలో అప్లోడ్ చేస్తే నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న మెటీరియల్ కాంపోనెంట్ నిధుల ఆధారంగా ప్రాధాన్యం ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కూలీలను పెద్ద సంఖ్యలో తరలించాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా పక్కాగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్


- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్యదైవమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో శుక్రవారం బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 26న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఎకరం స్థలంలో సేవాలాల్ భవనం, గుడితో పాటు ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఇందులో మహారాష్ట్రకు చెందిన సేవాలాల్ ఆరాధ్య పండితులు పాల్గొననున్నారని చెప్పారు. కాగా, ముఖ్యమంత్రి కేసీఆర్ 3,146 తండాలను గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచారని తెలిపారు. ఈసమావేశంలో సేవాలాల్ జయంతి ఉత్సవాల నియోజకవర్గ కోకన్వీనర్ రవి రాథోడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్యతో పాటు శ్రీరాం సుధీర్, బానోతు రవీందర్, వెంకన్న, పటేల్ నాయక్, పద్మ, రాజేందర్ పాల్గొన్నారు.

బొగ్గు రవాణాలో అంతరాయం ఏర్పడొద్దు



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం రమేష్

సత్తుపల్లిరూరల్: బొగ్గు రవాణాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా అధికారులు పర్యవేక్షించాలని సింగరేణి కొత్తగూడెం జనరల్ మేనేజర్ జక్కం రమేష్ ఆదేశించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ, సీహెచ్‌పీలను శుక్రవారం ఆయన తనిఖీ చేసి అధికారులు, సీహెచ్‌పీ నిర్వహణ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అవసరమైన రేక్‌ల కోసం రైల్వే శాఖతో సంప్రదించాలని చెప్పారు. ఈసమావేశంలో సింగరేణి అధికారులు వై.రఘురామిరెడ్డి, నర్సింహారావు, బంగారు శ్రీనివాస్, లక్ష్మణ మూర్తి, వి.కృష్ణయ్య, మధుసూదన్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

మళ్లీ కళకళలాడేలా..!

- అభయారణ్యాల్లో వన్యప్రాణుల సంతతి పెంపుపై దృష్టి
- జూ పార్కుల నుంచి తరలింపునకు అటవీ శాఖ ఏర్పాట్లు
- త్వరలోనే కిన్నెరసాని డీర్ పార్కు నుంచి 25దుప్పులు..



కిన్నెరసాని డీర్ పార్కులోని చుక్కల దుప్పులు

పాల్వంచ రూరల్: అభయారణ్యాలుగా ఇప్పుడు చెప్పుకునే ప్రాంతాలు గతంలో దట్టమైన అడవులతో కళకళలాడేవి. దీంతో సహజంగానే వన్యప్రాణులు, ఇతర జీవాలతో సమతుల్యత కనిపించేది. రానురాను స్మగ్లర్ల దాడులు, వేటగాళ్ల ఉచ్చులతో అటు అటవీ ప్రాంతం, ఇటు జీవాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కొత్తగూడెం అటవీ సర్కిల్ పరిధిలోని పాకాల, కిన్నెరసాని అభయారణ్యాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనగా.. వన్యప్రాణులు అక్కడక్కడా కనిపిస్తున్నా పులులు, చిరుతలు వంటివి అసలే కానరాకుండా పోయాయి. ఈ నేపథ్యాన పార్కుల్లో సాకుతున్న వన్యప్రాణులైన జింకలు, దుప్పులు వంటి వాటిని తిరిగి అభయారణ్యాల్లో వదలడం ద్వారా వాటి సంతతి పెంచాలని నిర్ణయించగా.. మరోపక్క పులులు, చిరుతలు వచ్చేందుకు కూడా మార్గం ఏర్పడుతుందనే నిర్ణయానికి అటవీ శాఖ వచ్చింది. ఇప్పటికే వరంగల్‌లోని కాకతీయ జూ పార్క్ నుంచి చుక్కల దుప్పులు, సాంబర్లు(కణుజులు), నెమళ్లను ఇటీవల ఏటూరునాగారం అభయారణ్యంలో వదిలారు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని డీర్ పార్క్ నుంచి కూడా జీవాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమతుల్యత లోపించి...
అభయారణ్యాల్లో దట్టమైన చెట్లు, మొక్కలతో పాటు నీటి వనరులు ఉంటే దుప్పులు, జింకలు, నెమళ్లు, మొసళ్లకు రక్షణతో పాటు సంతతి పెరగడానికి దోహదపడుతుంది. ఇదే సమయాన దుప్పులు, జింకల సంతతి పెరుగుతూ ఉంటే పులులు, చిరుతలు కూడా వచ్చివెళ్లడానికి లేదంటే అభయారణ్యంలో స్థిరనివాసం ఏర్పర్చుకునే అవకాశముంటుంది. కానీ అటు అడవులు తగ్గిపోయి, ఇటు వేటగాళ్ల ధాటికి దుప్పులు, జింకల వంటి వన్యప్రాణులు ఊర్లలోకి వస్తున్నాయి. మరోపక్క పులులకు కావాల్సిన ఆహారం దొరకక ఇతర అభయారణ్యాల్లో వెళ్లిపోతున్నాయి. అంతేకాకుండా వన్యప్రాణులను పార్కులు, ఇతర ప్రాంతాల్లో పెంచడం ద్వారా సహజ సిద్ధమైన వాతావరణానికి దూరమై సంతానోత్పత్తి తగ్గిపోతోందని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యాన వీటన్నింటిని మళ్లీ పూర్వ స్థితికి రావాలన్న లక్ష్యంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఇలా చేస్తే మేలు
కిన్నెరసాని డీర్ పార్క్ తదితర పార్కుల్లో జింకలు, దుప్పులు, నెమళ్లు, మొసళ్లను సంరక్షిస్తున్నారు. ఈ పార్కులో మొత్తం 135 చుక్కల దుప్పులు(జింకలు) ఉండగా ఇందులో 54 ఆడవి, 81 మగ జింకలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అలాగే, ఆరు మూషిక జింకలతో పాటు కొండగొర్రెలు, నెమళ్లు, మొసళ్లు కూడా ఉన్నాయి. అయితే, పార్క్ పరిధి చిన్నగా ఉండడంతో జీవాల సంతతితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తరచుగా రహదారులపై చేరడం, వాహనాలు ఢీకొని మృతి చెందడం నిత్యకృత్యమైంది. ఇక పులుల ఆనవాళ్లు జిల్లాలో అసలే లేకపోగా.. అప్పుడు చిరుతలు వచ్చివెళ్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పార్కుల్లో మూగజీవాలను అభయారణ్యాలకు తరలించడం ద్వారా కొంత మేరకు సమస్య తగ్గుతుందనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. అలాగే, అభయారణ్యాల్లో వన్యప్రాణుల సంతతి పెరగడానికి మార్గం సుగమవుతుందని.. తద్వారా పులులు, చిరుతలు కూడా ఇటు మార్గం పట్టే అవకాశముందని భావిస్తున్నారు. ఈ మేరకు వరంగల్ కాకతీయ జూ పార్క్ నుంచి ఇప్పటికే ఏటూరునాగారం అభయారణ్యానికి వన్యప్రాణులను తరలించినందున కిన్నెరసాని డీర్ పార్క్ నుంచి కూడా తరలింపునకు ఏర్పాట్లుచేస్తున్నారు.

త్వరలోనే జింకలను తరలిస్తాం



వైల్డ్‌లైఫ్ యానంబైల్ రేంజ్ పరిధి కిన్నెరసాని డీర్ పార్కులో మొత్తం 135 చుక్కల దుప్పులు ఉన్నాయి. ఇందులో 25దుప్పులను అభయారణ్యం పరిధిలోని మైదాన ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జింకలను ప్రత్యేక బోన్లలో తీసుకెళ్లి వన్యప్రాణుల సంఖ్య తక్కువగా ఉన్న అటవీ ప్రాంతంలో వదిలేస్తాం. ఆతర్వాత వేటగాళ్ల బారిన పడకుండా నిఘా వేస్తాం. ఇక వేసవిలో అభయారణ్యంలోని వన్యప్రాణులు ఇబ్బంది పడకుండా సోలార్ పంప్ సెట్ల ద్వారా నీరు సమకూరుస్తున్నాం.

– కె.దామోదర్‌రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ, పాల్వంచ

తీర్థాల జాతరకు బస్సులు ప్రారంభం



ఖమ్మం నుంచి తీర్థాల జాతరకు ఏర్పాటుచేసిన బస్సు వద్ద డీఎం శ్రీనివాస్, ఉద్యోగులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. ఈమేరకు ఖమ్మం సిటీ బస్టాండ్ వద్ద శుక్రవారం బస్సులను డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ఆదివారం వరకు ప్రతీ పది నిముషాలకో బస్సు తీర్థాలకు ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐ రాములు, కంట్రోలర్ రాములు, సిబ్బంది రమేష్, ఎంఆర్‌కే.నాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్నానాల లక్ష్మీపురం, నీలాద్రికి కూడా...
వైరా/సత్తుపల్లి టౌన్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం, పెనుబల్లి మండలం నీలాద్రిలో జరగనున్న జాతరకు ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్లు మధిర, సత్తుపల్లి డిపో మేనేజర్లు ఎస్.దేవదానం, యు.రాజ్యలక్ష్మి తెలిపారు. స్నానాల లక్ష్మీపురానికి వైరా బస్టాండ్ నుండి ప్రతీ అరగంటకో బస్సు చొప్పున మూడు రోజుల నడిపిస్తామని డీఎం దేవదానం తెలి పారు. పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10గా టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇక సత్తుపల్లి బస్టాండ్ నుంచి నీలాద్రికి ప్రతీ ఐదు నిమిషాలకో బస్సు నడిపిస్తామని, పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30గా చార్జీలు నిర్ణయించినట్లు డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. కాగా, వీ.ఎం.బంజర బస్టాండ్ మీదుగా నడిచే బస్సులను భక్తులు ఆదరించాలని ఆమె కోరారు.

కొత్తగూడెం నుంచి...
చుంచుపల్లి: మహాశివరాత్రి సందర్భంగా శనివారం కొత్తగూడెం నుంచి పలు శైవ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తగూడెం నుంచి నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, బెండాలపాడుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

మాకు పాఠాలు చెప్పించండి



హైకోర్టు సీజేకు రాసిన పోస్టుకార్డులతో విద్యార్థులు (ఇన్‌సెట్) సీజేకు పంపించిన పోస్టుకార్డులు

హైకోర్టు సీజేకు విద్యార్థుల పోస్టుకార్డులు

మహబూబాబాద్ రూరల్: భాషా పండితులు విధులు బహిష్కరించడంతో తాము ఇబ్బంది పడుతున్నందున.. పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టాలని మహబూబాబాద్ జిల్లా అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ఈమేరకు విద్యార్థులకు శుక్రవారం సీజేకు పోస్టు కార్డులు పంపించారు. భాషా పండితులు ఈనెల 1వ తేదీ నుంచి తెలుగు, హిందీ బోధన నిలిపేయడంతో పరీక్షలు సమీపిస్తున్నందున తాము నష్టపోయే ప్రమాదం ఉందని ఆ కార్డుల్లో పేర్కొన్నారు. ఈమేరకు న్యాయపరమైన చిక్కులు తొలగించాలని తమకు పాఠాలు సాగేలా చూడాలని విన్నవించారు.

ప్రజల గొంతెండుతున్నా స్పందించరా?

సీపీఐ ఆధ్వర్యాన మున్సిపాలిటీ ఎదుట నిరసన

సింగరేణి(కొత్తగూడెం): ప్రజల గొంతెండుతున్నా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్పందించకపోవడం గర్హనీయమని కొత్తగూడెం మున్సిపాలిటీ సీపీఐ పక్ష నాయకుడు వై.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణానికి కిన్నెరసాని నీటి సరఫరా పునరుద్ధరించాలనే డిమాండ్‌తో సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ కుండలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కిన్నెరసాని నీటి సరఫరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు, పాలకవర్గం విఫలమయ్యాయని ఆరోపించారు. నెలలో కేవలం నాలుగైదు రోజులే నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా కిన్నెరసాని నీటి సరఫరా పునరుద్ధరించాలని, అప్పటి వరకు ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయకపోతే ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని కమిషనర్ జి.రఘుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ కుండలతో నిరసన తెలిపుతున్న సీపీఐ కౌన్సిలర్లు